క్లుప్తంగా

పరిధి మేరకే వైద్యం చేయాలి

కరకగూడెం: ఆర్ఎంపీలు పరిధి మేరకు మాత్రమే వైద్యం అందించాలని ఎంపీపీ రేగా కాళిక, కరకగూడెం పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారి బైరిశెట్టి దుర్గనరేష్‌లు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో జిల్లా డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ఆర్ఎంపీలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధుల వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఆర్ఎంపీలు ఎవరికి వైద్యం అందిస్తున్నారో రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పీహెచ్‌సీకి సమాచారం అందించాలన్నారు. ఎవరైన పరిధికి మించి వైద్యం చేయరాదని లేని ఝెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో స్థానిక ఎస్సై రాజారాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది నిరసన తెలిపారు. ఔట్ సోర్సింగ్ జేఏసీ పిలుపులో భాగంగా గురుకుల కళాశాల ఎదుట సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. పది సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజకుమారి, షఫీ, సందీప్, రవి, పుల్లారావు, రవి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి, ఉసిర్లగూడెం గ్రామాల్లోగల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీడీపీఓ రోజారాణి హాజరై, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అలాగే బాలామృతం, 7వ నెలలో అందించాల్సిన ఆహారం, తల్లి పాల అవశ్యకత గురించి వివరించారు. అలాగే పోషకాహారం అధికంగా ఉండే ఆహార పదార్థాలు, కూరగాయాలను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో ఏసీడీపీఓ ప్రమీల, సర్పంచ్‌లు, మొడియం నాగమణి, జోత్స్నబాయి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, సౌజన్య, స్వరాజ్యం, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరియర్స్ చెల్లించాలి

మణుగూరురూరల్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీలో జరిగిన ఫిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోల్‌ఇండియా యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసి కార్మికులకు చెల్లించినప్పటికీ సింగరేణి యాజమాన్యం నేటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. ఏరియర్స్ చెల్లించని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఎంవి.రాంనర్సయ్య, ఆదర్ల సురేందర్, దాట్ల సందీప్, సాయిప్రకాష్‌చారి, రవి, కోటి, యుగేందర్, క్రాంతి, బి.సుధాకర్, పరమేశ్వర్, బ్రహ్మం, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని నాలుగో వార్డ్ పరిధిలోని గొల్ల బజార్‌లో రోడ్డు, సైడ్ డ్రెయిన్లను, పాత ఎస్‌బీసీ ఆఫీస్ ఎదురుగా ఉన్న కాలువకు మరమ్మతులు చేయపట్టాలని, ఇందిరా మార్కెట్‌లో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ వార్డ్ మెంబర్, సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు బండారు శరత్ బాబు మాట్లాడారు. వినతిపత్రం అందించిన వారిలో ఇజ్జడా రాంప్రసాద్, శ్రీనివాసరావు, కృష్ణబాబు, వీవీఆర్ ఆర్ ప్రసాద్, ఎస్. సత్యనారాయణ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మణుగూరురూరల్: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో పినపాక మండలం మల్లారం గ్రామపంచాయితీకి చెందిన 50 కుటుంబాల వారు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రేగా కాంతారావు వీరికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గిరిబాబు, పినపాక అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, యువజన నాయకులు సాంబశివరావు, రమేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చనలు, అన్నాభిషేకం, దూపదర్శనం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని ఎంపీడీఓ అన్నపూర్ణ దర్శించుకున్నారు.

మూకమామిడి ప్రాజెక్టుకు సుస్తీ

- పనిచేయని తూము షట్టర్
- 2వేల ఎకరాల సాగుకు ఎదురుదెబ్బ
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన



బీటలు వారిన ఆయకట్టు పరిధిలోని వరిపంట



షట్టర్ సమస్య ఏర్పడిన ప్రాజెక్టు కుడి కాలువ తూము ఇదే..

ములకలపల్లి: మూకమామిడి ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్ట్‌కు చెందిన కుడి కాలువ తూము షట్టర్ పనిచేయడం లేదు. దీంతో దీని పరిధిలోని 2 వేల ఎకరాల సాగుభూములకు సాగునీరందక అన్నదాత అగచాట్లు చెందుతున్నారు. నాలుగేళ్ల క్రితం సుమారు రూ.9 కోట్ల రూపాయలు విడుదల కాగా, మరమ్మతు పనులు చేపట్టారు. మరలా నాలుగేళ్లకే సమస్య ఏర్పడడంతో స్థానిక గిరిజన రైతులు మనోవేదనకు గురౌతున్నారు.

ఇదీ ప్రాజెక్ట్ నేపథ్యం..

మూడు వేల ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం గల ఈ మధ్యతరహా నీటిపారుదల జలాశయం.. 1978లో నిర్మాణం ప్రారంభమైంది. 1980లో పూర్తయి, అన్నదాతకు అందుబాటులోకి వచ్చింది. సుమారు 15 గిరిజన గ్రామాలకు చెందిన రైతులు దీనిపరిధిలో సేద్యం చేస్తున్నారు. కుడి కాలువ 5 కిలోమీటర్ల పొడవు ఉండగా, దీని పరిధిలో 2 వేల ఎకరాలు.. ఎడమ కాలువ 3.5 కిలోమీటర్ల పొడవుతో వెయ్యి ఎకరాలు సాగవుతున్నాయి.

రూ.9 కోట్లు ఖర్చు చేసినా..

ప్రాజెక్ట్ నిర్మించిన 40 ఏళ్లకాలం కావడంతో కొంత మేర శిథిలావస్థకు చేరింది. ఈ తరుణంలో 2019లో మరమ్మతులకు రూ.9 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటితో తూములు, షట్టర్లు, కాలువలు, పూడికతీత తదితర పనులు చేశారు. కాంక్రీట్‌తో కాలువలు నిర్మించారు. షట్టర్ల మరమ్మతులకే ప్రత్యేకంగా ఐదు లక్షల రూపాయలు వెచ్చించారు. అయినప్పటికీ నాలుగేళ్లకే కుడి కాలువ షట్టర్ పనిచేయడంలేదు.

ఈ సీజన్‌కు నీరందేనా..?

ప్రతీయేడాది లాగానే ఈ యేడు కూడా వర్షాల సమయంలో రైతులు వరినాట్లు వేశారు. రైతులు విస్తారంగా కురిసిన వానలకు ప్రాజెక్ట్‌లో 29 అడుగులమేర నీరు చేరి అలుగు పడడంతో అన్నదాతలు ఆనందించారు. అయితే నీటి అవసరం నిమిత్తం కుడి షట్టర్ పైకి ఎత్తేందుకు ప్రయత్నించగా, అది మొరాయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం షట్టర్ పైకి ఎత్తే అవకాశం లేకపోవడంతో, కుడి కాలువలోకి నీళ్ల ప్రవహించడంలేదు. దీంతో సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు అందకపోవడంతో వరిచేలల్లో నెర్రెలు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత వారం రోజులుగా ఎండలు వేస్తున్న తరుణంలో పంటలు వడలిపోతున్నాయని వాపోతున్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

నిపుణులను రప్పిస్తున్నాం..

ప్రాజెక్ట్ కుడి కాలువ షట్టర్‌లో నెలకొన్న సమస్యను గుర్తించాం. రాజమండ్రి, దవళేశ్వరానికి చెందిన గజ ఈతగాళ్లు ఆక్సిజన్ సిలిండర్ల సహాయంతో గాలించగా, నీటిలో 18 అడుగుల లోతులో షట్టర్ ఇరుక్కుపోయి స్ట్రక్ అయినట్లు గుర్తించాం. మరమ్మతులు చేపట్టేందుకు ముంబైకి చెందిన నిపుణులను రప్పిస్తున్నాం. రెండు మూడురోజుల్లో పనులు మొదలుపెడతాం. రైతులకు ఇబ్బందిలేకుండా చూస్తాం.

– గపూర్‌పాషా, ఏఈ నీటిపారుదల శాఖ

ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం



అశ్వాపురం: సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు

అశ్వాపురం: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో పినపాక నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలో సోమవారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు విస్తృతంగా పర్యటించారు. అశ్వాపురం, మొండికుంట, నెల్లిపాక, ఆనందాపురం గ్రామ పంచాయతీలలో ఎస్‌డీఎఫ్ నిధులు సుమారు రూ.1కోటి 20 లక్షలతో నిర్మించిన 24 సీసీ రోడ్లను ఎమ్మెల్యే రేగా ప్రారంభించారు. తురుములగూడెం గ్రామపంచాయతీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే రేగా శంకుస్థాపన చేశారు. ఆనందాపురం గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేగా రెండో విడత గొర్రెలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. పలువురు మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే రేగా పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రమాదేవి, సీఐ రవీందర్, పశు వైద్యాధికారి సరస్వతి, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, సర్పంచ్‌లు బాణోత్ శారద, మర్రి మల్లారెడ్డి, గొర్రెముచ్చు వెంకటరమణ, సున్నం రాంబాబు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, అధికారులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ పాల్గొన్నారు.

స్వర్ణకారుల నిరాహార దీక్ష

మణుగూరురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర స్వర్ణకారుల సంఘం పిలుపుమేరకు మణుగూరు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పూలమార్కెట్ సెంటర్‌లో స్వర్ణకారులు ఒక్క రోజు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బి.సతీష్‌చారి మాట్లాడుతూ.. స్వర్ణకారుల సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని, వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించాలని, అకాల మరణం చెందితే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ రూ.5వేలు ఇవ్వాలని, అధునాతన పరికరాల కోసం ఆర్థిక సాయం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం సమస్యలపై ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం మండల ఉపాధ్యక్షుడు శివ, కార్యదర్శి టి.పవన్, కోశాధికారి బావి సాయి, టి.మోహన్, వి.సత్యనారాయణ, సీహెచ్ వేణు, జి.రమేష్, శ్రీను, అభిషేక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన, ధర్నా



చర్ల: ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అశ్వాపురం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు అంగన్‌వాడీలు తెలిపారు. ఈ మేరకు ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. తమకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి పర్మినెంట్ చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోరెం శ్రీలత, హంసవేణి, రమాదేవి, విజయలక్ష్మి, భారతి, కళావతి, సుశీల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చర్ల: ఏళ్ల తరబడిగా పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మాచారి మాట్లాడారు. నాయకులు తాళ్లూరి కృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌నాయకులు స్వరూప, చిలకమ్మ, కృష్ణవేని, హేమలత, సత్యావతి, సావిత్రి, త్రివేణి, అంజమ్మ పాల్గొన్నారు.

డయాలసిస్‌కు కొత్త యంత్రాలు



ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో నూతన మిషనరీని ఏర్పాటు చేసిన దృశ్యం

భద్రాచలంఅర్బన్: డీసీడీసీ హెల్త్ సర్వీస్ ప్రాజెక్టు లిమిటెడ్ వారు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సాంకేతికతతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని సోమవారం ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. మొత్తం పది బెడ్లను డయాలసిస్ రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీడీసీ సీనియర్ ఆపరేషనల్ మేనేజర్ భాస్కర్, ఆపరేషనల్ రీజినల్ మేనేజర్ మహేష్, డయాలసిస్ సెంటర్ మేనేజర్ అనూష, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ వ్యక్తి తనపై దాడి చేశారంటూ సోమవారం చేసిన ఫిర్యాదు మేరకు 5గురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన అర్ధరాత్రి రాజుపేట కాలనీకి చెందిన రిక్క శివశంకర్ రెడ్డి ఇంటిలోనికి సాయిరాం, కామేష్, పండు, మధు, అశోక్‌లు చొరబడ్డారు. శివశంకర్ రెడ్డిని అతని తండ్రిని కర్రతో కొట్టి, బూతులు తిట్టారు. చంపుతామని బెదిరించారు. శివశంకర్‌కు గాయాలయ్యాయి. అనంతరం సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కాగా, ఒక కేసుకు సంబంధించి తమ స్నేహితుడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకే ఆ ఐదుగురు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ద్విచక్ర వాహనం చోరీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన నాగేందర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు సోమవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

నాగేందర్ గత నెల 31వ తేదీన ఆర్టీసీ బస్‌స్టాండ్‌లోని ఆంధ్ర రిజర్వేషన్ కౌంటర్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్‌లో పెట్టాడు. ఆపై పనినిమిత్తం మహబూబాబాద్ వెళ్లాడు. తిరిగి ఈ నెల 3వ తేదీ వచ్చి చూసే సరికి పార్క్ చేసిన ద్విచక్ర వాహనం కనిపించ లేదు. చుట్టుపక్కల వారిని, తెలిసిన స్నేహితులను ఆరా తీయగా ఎటువంటి సమాచారం తెలియరాలేదు. దీంతో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

గడపగడపకూ కాంగ్రెస్ పాదయాత్ర



మణుగూరురూరల్: ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: మణుగూరు మండల, మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం నుంచి గడపగడపకూ కాంగ్రెస్ పాదయాత్రను చేపట్టారు. శ్రీశ్రీనగర్, సుందరయ్యనగర్, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర కొనసాగింది. యాత్రలో వరంగల్, హైదరాబాద్, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మణుగూరు వైస్ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు వెంకట్రావు గౌడ్, కనకయ్య, బాజీ, తరుణ్‌రెడ్డి, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

గడప గడపకూ కాంగ్రెస్ పాదయాత్రలో సుమారు 50 కుటుంబాల వారు వివిధ పార్టీలను వీడి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాలు అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని రేపల్లెవాడ, సత్యనారాయణపురం గ్రామాల్లో సోమవారం రాత్రి ఆయన పర్యటించి కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోను ప్రచారం చేశారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తానని, అభ్యర్థి ఎవరైనా పార్టీని గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, మల్లం కృష్ణయ్య, బాణోత్ రాముడు, ప్రసాద్ ఉన్నారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

బూర్గంపాడు: బూర్గంపాడులోని తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాల(బాలికలు)లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 6వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పదో తరగతిలో కనీసం 5 జీపీఏ వచ్చిన విద్యార్థులు ఎంపీసీలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

8న లోక్ అదాలత్

భద్రాచలంఅర్బన్: ఈ నెల 8న భద్రాచలం ఫస్ట్ క్లాస్ జ్యుడిషల్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ జడ్జి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు రూ.100 మాత్రమే జరిమానా విధించడం జరుగుతుందని, అలాగే రాజీ పడదగిన చెక్కు బౌన్స్, చిన్న చిన్న గొడవలు, భార్య భర్తల, కుటుంబ సమస్యలు, బ్యాంక్ తదితర కేసులకు సంబంధించిన వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆయా కేసుల నుంచి త్వరితగతిన ఉపశమనం పొందాలని న్యాయమూర్తి వెంకటేశ్వర్లు తెలిపారు.

సొంత డబ్బుతో మరమ్మతు

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి రూ.30 వేల సొంత డబ్బులతో సోమవారం రోడ్లకు గ్రావెల్ తోలించారు. గ్రామంలోని మసీద్ వెనుకబజార్, వేల్పుల పెద్దవీరయ్య బజార్, రాంబాబు బజార్, దుంప సాయమ్మ బజార్‌ల రోడ్లు గుంటలు పడి, వర్షపునీరు నిల్వ ఉండటంతో.. ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ తిరిగి అందజేత

మణుగూరురూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మణుగూరు సీఐ బాలాజీ వరప్రసాద్ సోమవారం బాధితుడికి తిరిగి అందజేశారు. భద్రాచలానికి చెందిన గోన సుధాకర్ మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత నెల 9వ తేదీన విధి నిర్వహణ క్రమంలో సుధాకర్ తన రూ.30వేల విలువ గల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. సీఐ బాలాజీ వరప్రసాద్ బాధితుడు సుధాకర్‌కు సోమవారం సెల్‌ఫోన్‌ను అందజేశారు.

దళితులకే వర్తింపజేయాలి

దుమ్ముగూడెం: నిజమైన దళితులకే దళితబంధు పథకం వర్తింపజేయాలని దళిత హిందూ మాలనాడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి వెంకటరాజు డిమాండ్ చేశారు. సోమవారం రేగుబల్లిలో జరిగిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. చర్చిలకు వెళ్తూ ఎస్సీ సర్టిఫికెట్‌లతో దళితబంధుకు దరఖాస్తు చేసుకున్నవారిపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని కోరారు. జెట్టి వెంకటేశ్వర్లు, వన్నాల రవి, తాళ్ల ముత్యాలు, బిక్షం పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన సోయం

దమ్మపేట: వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి, ఇటివలే పదవికి రాజీనామా ప్రకటించిన సోయం వీరభద్రం, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలోని నివాసంలో తుమ్మలను కలిసిన వీరభద్రం.. ఆశీర్వాదం కావాలని కోరినట్టు సమాచారం.

జయశంకర్‌నగర్‌లో వైద్యశిబిరం



కరకగూడెం: మందులు అందజేస్తున్న వైద్యాధికారి కుమారస్వామి

మణుగూరురూరల్: మండల పరిధిలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీ జయశంకర్‌నగర్‌లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ అనూష గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పలువరు జ్వర బాధితుల రక్తనమూనాలను సేకరించి జాగ్రత్తలు సూచించారు. అనంతరం నీటి నిల్వ ప్రాంతాల్లో యాంటీలార్వా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సత్తెమ్మ, హెచ్‌వి.జానకి, రాంప్రసాద్, ప్రభావతి, రవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం..

కరకగూడెం: మండల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని దేవరానాగారం గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశిబిరంలో సుమారు 78 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఓ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న చారుగుళ్ల శ్రీనివాస్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో బస్టాండ్ వద్ద గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియల నిమిత్తం జిల్లా ఆర్యవైశ్య మహాసభ తరపున సోమవారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తాన్ని పట్టణ ఎస్సై మధుప్రసాద్ చేతుల మీదుగా అందించారు. జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు సురే వెంకట చెంచు సుబ్బారావు, బండారు కృష్ణయ్య, నాళ్ల సాయచంద్, సంకా కృష్ణార్జునరావుల సహకారంతో ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైటర్ లక్ష్మణ్, హాస్పిటల్ పోస్ట్ మార్టం సిబ్బంది పాల్గొన్నారు

'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని గిరిజనేతరులకు సైతం గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో ఏళ్ల తరబడి నివసిస్తున్న గిరిజనేతరులకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింప చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కనకరాజు, జయరాజు, యేసు, బాబు, రామకృష్ణ, నరేష్, శ్యామ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని నడికుడి పంచాయతీ పరిధిలోని నడికుడి, నందులచెలక, రామ్మూర్తి గుంపు తదితర గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలో తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమవడంతో స్తానికులు కిలోమీటర్ పైగా దూరం వెళ్లి చిమ్మ చీకటిలో దుగాల మీదగా నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. 'కొంగవాగు బ్రిడ్జి'ని ర్మాణం చేపట్టకపోతే వేలాదిమంది గిరిజన రైతాంగం వ్యవసాయం చేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని జాప్యం జరిగితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సోయం కృష్ణమూర్తి, ముదిరాజు, తెల్లం రామ్మూర్తి ,కురసం వెంకటేశ్వర్లు, మడకం రత్నకుమార్, చందు అశోక్ కుమార్, వర్ష సీత, సోయం సీత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం వద్దు

భద్రాచలంటౌన్: పట్టణంలోని మనుబోతుల చెరువులో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రాజకీయ జోక్యం లేకుండా పేదలకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పేద ప్రజల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక కోఆర్డినేటర్ అలవాల రాజా పెరియర్ మాట్లాడుతూ.. రాజకీయ జోక్యం, దళారి వ్యవస్థ పెరిగిపోవడంతో నిజమైన అర్హుడికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరి కాలేదని విమర్శించారు. కార్యక్రమంలో సమ్మక్క, లత, కుమారి, రమాదేవి, కృష్ణవేణి, నాగమణి, హేమలత, మేరీ, సమత, నిర్మలమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పల్లె ప్రగతిబాట'



బూర్గంపాడు: ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత తదితరులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామపంచాయతీ, వివేకానందకాలనీల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కేసీఆర్ పల్లె ప్రగతిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ నాయకులు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో తోగ్గూడెం సర్పంచ్ బొగ్గం రజిత, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి నవీన్, నాయకులు వీరస్వామి, బొగ్గు రవి, సత్యవతి, కంభంపాటి శ్రీను, ప్రసాద్, కె.రాజ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్షగా నిలుస్తాయని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు.ఇంటింటికి తెలంగాణ ప్రభుత్వ పథకాల ప్రచారంలో భాగంగా సోమవారం సారపాకలోని పలు ప్రాంతాలలో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేపట్టాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతి కోసం దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కాని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పొడియం నరేందర్, కొనకంచి శ్రీనివాస్, బాలి శ్రీహరి, చట్టు ఆంజనేయులు, తుపాకుల రవి తదితరులు పాల్గొన్నారు.